క్లుప్తంగా

రాజానగరంలో రేపు మినీ జాబ్ మేళా

రాజానగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని స్కిల్ హబ్ వద్ద బుధవారం మినీ జాబ్ మేళా జరగనుంది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ సోమవారం ఈ విషయాన్ని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఉత్తీర్ణులై, బ్యాంకింగ్ అండ్ నాన్ బ్యాంకింగ్ సెక్టార్‌లో అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రెండుసెట్ల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 10 గంటలకే స్కిల్ హబ్ వద్దకు చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు 73967 40041 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

రంగంపేట: గీత కార్మిక కులాలకు చెందిన వారికి ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల కోసం ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలు ఉన్నాయన్నారు. మండలానికి ఒకటి చొప్పున మొత్తం మూడు మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. రంగంపేట, బిక్కవోలు మండలాలకు శెట్టిబలిజ, అనపర్తికి గౌడ సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో గానీ, రంగంపేట ఎక్సైజ్ స్టేషన్‌లో స్వయంగా గానీ అందించవచ్చన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నామని ఆ గ్రామ సర్పంచ్ వల్లు వెంకట రమణ తెలిపారు. ఈ నెల 8వ తేదీన గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం జరగనున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్యం మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. చెత్తకుప్పలు, రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను తొలగించి, బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలతో ప్రమాదం



బూరుగుపూడి సమీపంలో నిలిచిన ఊక లారీ

మధురపూడి: ఓవర్ లోడును రవాణా చేస్తున్న వాహనాల రాకపోకలతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలోని అయ్యనగళ్లు కాలువ వద్ద సోమవారం ఓవర్ లోడుతో వెళుతున్న ఊక లారీని టిప్పర్ కుడి వైపున రాసుకుంది. దీంతో ఊక లారీ పక్కకు ఒరిగిపోయింది. దానిలోని ఊక మొత్తం రహదారిపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు జరిపి, అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. రంగంపేటలోని మంచినీటి చెరువు వద్ద గల విజయదుర్గమ్మ ఆలయంలో అర్చకుడు నారాయణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ



నర్సాపురంలో పొలానికి మందు జల్లుతున్న రైతు

మధురపూడి: రబీ సీజన్‌లో సాగుకు చేసిన వరికి తెగుళ్లు సోకడంతో రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో వరికి ఎండు తెగులు, ఆకుముడత తెగులు సోకాయి. వాటి నివారణకు ఎరువులు, పురుగు మందులను చల్లుతున్నారు. నర్సాపురం, గాదరాడ, కణుపూరు, రాజవరం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లో తెగుళ్ల సమస్య అధికంగా ఉంది. యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆరోగ్య ప్రదాత ఆదిత్యుడు

- నేడు రథసప్తమి వేడుకలు
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు



పందలపాకలో యోగా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

బిక్కవోలు: లోకానికి వెలుగులు ప్రసాదించే సూర్య భగవానునికి హైందవ పురాణేతిహాసాల్లో సముచిత స్థానం ఉంది. నిత్యం వేకువజామునే సూర్యనమస్కారాలు చేస్తే మనోఫల సిద్ధి కలుగుతుందని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రజల విశ్వాసం. శాస్త్రీయంగానూ ఇది నిజమేనని వైద్యులు చెబుతున్నారు. సూర్య కిరణాల్లో దాగి ఉండే డి విటమిన్ వల్ల మనిషికి ఎంతో మేలు కలుగుతుంది. ఆ కారణంతోనే పసికందులను ఉదయాన్ని కొంత సేపు ఎండలో ఉంచుతారు. సూర్య నమస్కారాలు చేస్తూ ఆసనాలు వేయడం వల్ల శారీరక బలం చేకూరుతుంది. మొత్తం 12 రకాల ఆసనాల ద్వారా సూర్య నమస్కారాలు చేయవచ్చని యోగా గురువులు తెలిపారు. సూర్యుడు ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష కర్మసాక్షి, చైతన్యమూర్తి, ప్రత్యక్ష భగవంతుడు, గ్రహ నాయకుడు. ఆయనను ఆరాధించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయి.



పందలపాకలోని భావనారుషి ఆలయం వద్ద సూర్యభగవానుడి విగ్రహం

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని సూర్యనారాయణమూర్తి ఆలయాలలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రోజు సూర్యుడికి నమస్కరించడం హిందూ సంప్రదాయంలో ఒక భాగం. మాఘమాసంలో ప్రతి రోజు సూర్య ఆరాధన చేసేవారు, సూర్యుడికి పూజలు జరిగేటప్పుడు చూసేవారు, తీర్థ ప్రసాదాలు తీసుకునే వారు విశేష శుభ ఫలితాలు పొందుతారని మాఘ పురాణం చెబుతోంది. మాఘమాసంలో రథసప్తమి చాలా విశేషమైంది. సూర్యభగవానుడి ఆవిర్భావం జరిగిన రోజుగా భావించే రథసప్తమిని సూర్య జయంతిగా నిర్వహిస్తారు.



జి.మామిడాడలో సూర్యనారాయణస్వామివారి దేవాలయ గోపురం

రథసప్తమి నుంచి వేసవి కాలం



రథసప్తమి రోజే సూర్య భగవానుడి జన్మదినం. ఈ రోజు నుంచే వేసవి కాలం ప్రారంభమవుతోంది. అందుకే రథ సప్తమి రోజు చేస్తే సూర్య నమస్కారాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. సూర్యారాధన వేద కాలం నుంచీ ఉంది. సూర్య కిరణాల్లో విటమిన్ డి ఉంటుంది.

– గరిమెళ్ల కాశీ విశ్వేశ్వరరావు (బుజ్జి), పండితుడు, పందలపాక

డి విటమిన్ చాలా మంచిది



ప్రతి రోజూ సూర్యోదయ సమయంలో నడవడం చాలా మంచిది. దీని వల్ల శరీరానికి డి విటమిన్ తగిలి అనారోగ్య సమస్యలు దరి చేరవు. ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చు. ఉదయాన్నే నడవడం వల్ల మానసికంగా కూడా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. రోజంతా చురుకుగా పని చేసుకునే వీలు కలుగుతుంది.

– మల్లిడి కృష్ణారెడ్డి, వైద్యుడు, పందలపాక

ఆధ్యాత్మికతతో ఆరోగ్యం



నిత్యం సూర్య నమస్కారాలు చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారు. 12 ఆసనాలతో ఒక సారి సూర్య నమస్కారం చేసినట్లు అవుతుంది. ఈ రోజుల్లో ఆరోగ్యవంత జీవితాన్ని పొందడానికి సూర్యనమస్కారం చాలా ముఖ్యం. యోగాలోని భాగమైన దీనిలో కూడా ఆధ్యాత్మికత కూడా కలిసి ఉంది.

– దార్వంపూడి యువరాజారెడ్డి, యోగా గురువు, జి.మామిడాడ

కరకుదురు పంచాయతీ బడ్జెట్ రెడీ



కరకుదురు బడ్జెట్‌ను అందజేస్తున్న కార్యదర్శి ప్రసన్న ఆంజనేయులు

పెదపూడి: కరకుదురు పంచాయతీకి సంబంధించిన 2025–26 సంవత్సర అంచనా బడ్జెట్‌ను సిద్ధమైంది. దీన్ని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి భోగరాజు ప్రసన్న ఆంజనేయులు సోమవారం ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసుకు సమర్పించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఇది ప్రథమంగా తయారు చేసిన గ్రామ పంచాయతీ బడ్జెట్ అన్నారు. పంచాయతీకి వచ్చే సొంత ఆదాయం, ఉపాధి హామీ పథకం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంటులతో కలిపి అంచనా బడ్జెట్ రూ.1,16,82,510గా, అంచనా వ్యయం రూ.1,04,42,298గా, మిగులు బడ్జెట్ రూ.12,04,212గా మొదటి ప్రజా గ్రామ సభలో ఆమోదించారన్నారు. తమకు సమర్పించిన బడ్జెట్‌ను ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఏఈ పీఆర్ శాఖ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం ఏపీఓలు పరిశీలించి సంతకాలు అయిన అనంతరం ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడు చేస్తారన్నారు. జిల్లాలోనే మొదటిగా బడ్జెట్ తయారు చేసి సమర్పించిన ప్రసన్న ఆంజనేయులును ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ ఎం.శ్రీనివాసు అభినందించారు.

ప్రాథమిక విద్యాబోధన ఎంతో కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

రాజానగరం: ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులు ఎంతో కీలకమని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. అందుకనే ఈ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఏటా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. ఏటాదికి 20 రోజులు చొప్పున మూడేళ్లలో 60 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో పునాది అభ్యసనా శిక్షణ కార్యక్రమం (9వ బ్యాచ్) సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో మమేకమై బోధన చేయాలన్నారు. కాగా.. ఈ కార్యక్రమాన్ని డీఈఓ సందర్శించారు. శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన లెర్నింగ్ కార్నర్స్‌లో కొందరు ఉపాధ్యాయులు పప్పెట్ మాస్కులు ధరించి హాజరుకావడాన్ని డీఈఓ అభినందించారు. ఇలా ఆటపాటలతో సాగించే అభ్యసనం విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. ఈ పునాది అభ్యసన శిక్షణ శిబిరం ముఖ్యఉద్దేశం కూడా ఇదేనన్నారు. మోనటరింగ్ అధికారి డి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ ఈ శిక్షణకు తూర్పు గోదావరి నుంచి 15 మంది, కాకినాడ జిల్లా నుంచి 95 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 169 మంది ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎంఈఓ రామకృష్ణ, డైట్ లెక్చరర్ రాజ్‌కుమార్, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ కె. అనూష, ఇద్దరు కేఆర్పీలు, 22 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

‘పది’లో నూరుశాతం ఫలితాలకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

రాజానగరం: పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఫలితాలను సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, వారి ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు మమేకమై, ఉత్తమ ఫలితాల కోసం వారు చేస్తున్న సాధనపై ఆరా తీశారు. పబ్లిక్ పరీక్షలకు 40 రోజులు మాత్రమే వ్యవధి ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పునశ్చరణకు ప్రాధాన్యతనిస్తూ అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా సాధన ఉండాలన్నారు. సెల్‌ఫోన్లకు సాధ్యమైనంత దూరంగా ఉండటమే మంచిదని హితవు పలికారు. సెలవులలో నిర్వహించే ప్రత్యేక తరగతులను ఏ ఒక్కరూ గైర్హాజరు కావొద్దన్నారు. సెలవు రోజులలో కూడా ప్రభుత్వం మధ్యాహ్న భోజనాలను సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం తాతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ కళాశాలలో శిల్పం ఆవిష్కరణ



శిల్పాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: ‘మీ జీవితాన్ని మీరే మలుచుకోవాలి’ అనే సందేశం ఇస్తున్నట్టుగా ఉన్న ఒక శిల్పాన్ని స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు సోమవారం ఆవిష్కరించారు. ‘యు ఆర్ ది ఆర్కిటెక్ ఫర్ యువర్ లైఫ్’ అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ శిల్పాన్ని జీఎస్ఎల్ స్టాట్యూగా ఆ సంస్థ చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీజీ మార్కెట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారిశెట్టి మృతి



రాజమహేంద్రవరం రూరల్/మధురపూడి: వెంకటేశ్వర జనరల్ మార్కెట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రస్తుత గౌరవాధ్యక్షుడు, చాంబర్ మాజీ అధ్యక్షుడు మారిశెట్టి వెంకట రామారావు (85) ఆదివారం రాత్రి కోరుకొండ మండలం నరసాపురంలో మృతి చెందారు. ఎస్వీజీ మార్కెట్ ఏర్పాటులో ఆయన కీలక భూమిక పోషించారు. నరసాపురంలో ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, ఎస్వీజీ మార్కెట్ అధ్యక్ష, కార్యదర్శులు నందెపు శ్రీనివాస్, మద్దాల రవిశంకర్, ఉపాధ్యక్షుడు బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, డైరెక్టర్లు, వర్తకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారిశెట్టి రామారావు మనవడు రవి కుమార్ చేతుల మీదుగా నరసాపురం గ్రామంలో అంత్యక్రియలు జరిపారు. మారిశెట్టి మృతికి సంతాపంగా సోమవారం ఎస్వీజీ మార్కెట్ సెలవు ప్రకటించి, షాపులను మూసివేశారు.

ఉద్యోగుల సమస్యలపై త్వరలో సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఏపీ ఎన్జీవో సంఘం రాజమహేంద్రవరం నగర శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన డైరీని సోమవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, నగర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణు మాధవరావు, నగర్ ఎన్జీవో నాయకులు మాధవరావు, సత్యమూర్తి, రాఘవరావు, వెంకటరావు, రమేష్ పాల్గొన్నారు.

ఘర్షణ విషయంలో ఇరు వర్గాలపై కేసులు

సీతానగరం: మిర్తిపాడులో ఆదివారం జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. ఒక వర్గం యువకులు మోటారు సైకిల్‌పై వెళుతూ, మరో వర్గం యువకులకు సైగ చేయడంతో వివాదం మొదలైందన్నారు. దీనిలో మిర్తిపాడుకు చెందిన మేడే దుర్గాప్రసాద్‌పై కాళ్ల దుర్గాప్రసాద్, కాళ్ల నాగేంద్ర, గురు శివ కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. తలకు తీవ్రగాయాలపైన దుర్గాప్రసాద్ రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు. దీనిపై డీఎస్పీ విచారణ నిర్వహిస్తారని తెలిపారు.

▸▸ మిర్తిపాడుకు చెందిన రాజన పైడియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటనగరం, మిర్తిపాడుకు చెందిన పదిహేను మందిపై కేసులు నమోదు చేశామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు. మిర్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్ వెంకటనగరానికి చెందిన యువకులు తనను కర్రలతో తీవ్రంగా కొట్టడంతో తలకు, అలాగే రక్తపు గాయాలయ్యాయని పైడియ్య ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో బజ్జి శరత్, వాడపల్లి, సురేష్, బన్ను, కోనాల కిషోర్, పెనుగుల చందుతో పాటు పదిహేను మందిపై కేసులు నమోదు చేశామన్నారు. మిర్తిపాడులో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెటింగ్ కొనసాగుతోందన్నారు.

250 మందికి వైద్య సేవలు



సీతానగరం కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: రామకృష్ణ మిషన్, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు యన్నమనేని రామచంద్రరావు (ఎన్ఆర్ఐ), రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్ బాబు 250 మందికి వైద్యసేవలు అందించారు. సాధారణ శిబిరంలో 183 మందికి వివిధ వైద్య పరీక్షలు జరిపి, మందులను ఉచితంగా అందించారు. కంటి శిబిరంలో 67 మందికి కంటి పరీక్షలు జరిపారు. వారిలో ఏడుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఉచితంగా శస్త్రచికిత్స చేయడానికి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, వలవల వెంకట్రాజు (తోటలో రాజు), సుబ్బరాజు, వలవల కొండల రాయుడు, బోడపాటి సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాసరావు, చంటిబాబు పాల్గొన్నారు.

ఆక్సిజన్ యూనిట్ అందజేత



వైద్యులకు ఆక్సిజన్ యూనిట్ అందజేస్తున్న దర్శకుడు కాశీవిశ్వనాథ్

సీతానగరం: పురుషోత్తపట్నానికి చెందిన సినీ దర్శకుడు, నటుడు యనమదల కాశీ విశ్వనాథ్ సోమవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆక్సిజన్ యూనిట్ అందించారు. పురుషోత్తపట్నంలోని తన స్వగృహం వద్ద పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య, డాక్టర్ ఎస్.రాజుకు దీనిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు అత్యవసర సమయంలో ఈ ఆక్సిజన్ యూనిట్ చాలా ఉపయోగపడుతుందన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ కొరత ఏర్పడిందని, అటువంటి పరిస్థితి కలగకుండా ఆక్సిజన్ యూనిట్ అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం పద్మజ్యోతి, స్థానికులు మండా రాంబాబు, వేములపల్లి గంగరాజు, జుజ్జవరపు రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

మధురపూడి: వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం కోరుకొండలోని సరస్వతీ విద్యానికేతన్‌లో సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఐదేళ్ల వయసున్న 108 మంది చిన్నారులతో వేద పండితులు అక్షరాలను దిద్దించారు. కరెస్పాండెంట్ పెనకటి గంగాధరరావు, వైస్ ప్రిన్సిపాల్ నాళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీతానగరం: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే వేల గొంతులు – లక్ష డప్పులు మహా ప్రదర్శన పోస్టర్‌ను సోమవారం సీతానగరంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు శేఖర్ బాబు, న్యాయవాదులు చిడిపి నకుల సురేష్, కొప్పాక రాజారావు, నాయకులు సనమండ్ర లాజర్, మద్దాల ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగ, మాదిగ ఉపకులాల వారు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి ఆదివాసీ మహోత్సవాలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 5, 6 తేదీల్లో జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యాన జరిగే ఈ ఉత్సవాల పోస్టర్‌ను ఆ సమాఖ్య ప్రతినిధులు సోమవారం విడుదల చేశారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు ఒక విశిష్టత ఉందని, వాటిని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వాలతో పాటు ప్రజలపై ఉందని టీఎస్ఎఫ్ ప్రతినిధులు మల్లి భాస్కర్, కె.అక్కులప్ప నాయక్, విష్ణునాయక్, పల్లాల రాజకుమార్‌రెడ్డి, ఆర్.సుమిత్ పేర్కొన్నారు.

అణు కార్యకలాపాలపై అపోహలు తొలగించాలి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మహాపాత్ర, ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అణు కార్యకలాపాలు, అణుశాస్త్రం చుట్టూ ఉన్న అపోహలను తొలగించాలని ముంబైలోని భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) రేడియో కెమిస్ట్రీ విభాగం, రేడియో కెమిస్ట్రీ ఐసోటోప్ గ్రూప్ మాజీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పీకే మహాపాత్ర అన్నారు. ‘రేడియో కెమిస్ట్రీ, రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు’ అనే అంశంపై స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఐదు రోజుల జాతీయ వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. బార్క్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ కెమిస్ట్స్ అండ్ అలైడ్ సైంటిస్ట్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను డాక్టర్ మహాపాత్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఈ సందర్భంగా ‘డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎట్ ఎ గ్లాన్స్, శాంతియుత అణుశక్తి ఉపయోగాలు’ అనే అంశంపై మహాపాత్ర కీలకోపన్యాసం చేశారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఆహార భద్రత, ఇంధన ఉత్పత్తి, పర్యావరణ స్థిరత్వంలో అణు శాస్త్రం పాత్రను ఆయన వివరించారు. రేడియో కెమిస్ట్రీ, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ, పర్యావరణ శాస్త్రాల్లో రేడియో ఐసోటోప్‌ల విభిన్న అనువర్తనాలపై సమగ్ర అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. పాలిమర్ సైన్సెస్, బయోసైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, పర్యావరణ శాస్త్రాలు, పారిశ్రామిక అనువర్తనాల వంటి వివిధ రంగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ, దేశంలోని వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి అధ్యాపక సభ్యులు, పరిశోధన పండితులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గౌరినాయుడు, కన్వీనర్ డాక్టర్ పీఎస్ రామాంజనేయులు పాల్గొన్నారు.